శరీరానికి వెన్నుదన్ను జాగ్రత్త !

- ఆధునిక జీవన శైలితో పెరుగుతున్న సమస్యలు
- పెద్దఎత్తున వ్యాధుల బారిన పడుతున్న యువత
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు
- వెన్నుముక సర్జరీల్లో ఆధునిక పద్ధతులు
- డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంతో ఉచితంగా శస్త్ర చికిత్సలు

గుంటూరు మెడికల్: ఆధునిక జీవన శైలి వల్ల వెన్నుముక సమస్యలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు సైతం అధిక బరువున్న బ్యాగులను మోయడంతో వెన్ను సమస్యల బారిన పడుతున్నారు. కళాశాల యువత సైతం తరగది గదుల్లో ఎక్కువ సేపు కూర్చోలేక వైద్యుల్ని సంప్రదిస్తున్నారు. వెన్ను సమస్యల్ని ప్రాథమిక దశలోనే గుర్తించి మెరుగైన వైద్యం అందించడం ద్వారా నయం చేయవచ్చు. అయితే, ఆపరేషన్లు, వైద్య విధానాల గురించి ప్రజల్లో అనేక అపోహలు ఉండటం, అవగాహన లేక పోవడంతో సమస్యల్ని పెద్దవి చేసుకుని చివరి దశలో వైద్యుల్ని సంప్రదిస్తున్నారు. వెన్ను సమస్యలపై అవగాహన కల్పించేందుకు 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.


శరీరంలో వెన్నుముక నిర్మాణం

బాధితులు అధికమే...

గుంటూరు జీజీహెచ్‌కు ప్రతిరోజూ 300 మంది ఆర్థోపెడిక్ వైద్య విభాగంలో వివిధ రకాల సమస్యలతో చికిత్స కోసం వస్తున్నారు. వీరిలో 60మంది వెన్నుముక సంబంధిత సమస్యలతో బాధపడేవారే. గుంటూరు జిల్లాలో 200 మంది ఆర్థోపెడిక్ సర్జన్స్ ఉన్నారు. ప్రతిరోజూ ఒక్కో వైద్యుడి వద్దకు 20 మంది వరకు వెన్నుముక సమస్యలతో చికిత్స కోసం వస్తున్నారు.

వెన్నుముక కీలకం

ఎముకలన్నింటిలో ముఖ్యమైంది వెన్నుముక. వెన్నుపాముకు రక్షణ కల్పిస్తుంది. వెన్నుముక నుంచే నరాలు బయటకు వస్తాయి. మనం నిటారుగా నిలబడటానికి, పక్కకు, వెనుకకు, ముందుకు తిరగడానికి ఎటుకావాలంటే అటు వంగడానికి ఉపయోగపడుతోంది. వెన్నుపూసలు ఒక దానికొకటి క్రమపద్ధతిలో అమరి వెన్నుముకను ఏర్పరుస్తాయి. కండరాలు, లిగమెంట్లు, ఆరోగ్యంగా రెండువైపులా ఒకేరకమైన బిగువుతో ఉంటే వెన్నుపూస దాని స్థానంలో నిలిచిఉంటుంది. వెన్నుపూసలు వాటి స్థానంలో సక్రమంగా నిలిచి ఉండాలంటే పటుత్వం బాగుండాలి. కండరాలకు వెన్నుపూస ఎముకల మధ్య సమతూకం దెబ్బతింటే నడుం నొప్పి వస్తుంది.

వెన్నుసమస్యలకు కారణాలు

ప్రతి మనిషి తన జీవిత కాలంలో ఏదో ఒకరోజు వెన్నునొప్పితో బాధపడతాడు. ఎక్కువసేపు కంప్యూటర్ల ముందు కూర్చుని పని చేయడం, స్మార్ట్ ఫోన్లు వినియోగిస్తూ ఎక్కువసేపు ఒకేచోట కూర్చుండి పోవడం, ఊబకాయం, శారీరక శ్రమ లేక పోవడం, జీవనశైలిలో మార్పులు, ధూమపానం, కార్లు, ద్విచక్ర వాహనాలపై ఎక్కువ దూరాలు ప్రయాణాలు చేయడం, గుంటలున్న రోడ్లపై వాహనాలు నడపడం, ఒత్తిడితో కూడిన జీవితాన్ని గడిపే వారిలో వెన్నుముక సమస్యలు వస్తున్నాయి.

వయస్సు పెరిగే సహజ అరుగుదల

సాధారణంగా వయస్సు పెరిగే కొద్ది వెన్నుపూస మధ్యలో ఉండే డిస్కులు అరిగి గ్యాప్ ఏర్పడుతోంది. ఇందులో కొత్తగా కండరం పెరగడం, లేదా ఎముక పెరగడం జరిగి నడుము నొప్పి, తుంటి నొప్పి, కాలుజాలు, కాలు తిమ్మిరి, కాలు పటుత్వం తగ్గిపోవడం, మలమూత్రాలను ఆపుకోలేక నియంత్రణ కోల్పోవడం జరుగుతోంది. డిస్కు జారినప్పుడు గజ్జల్లో నొప్పి, తొంటి నొప్పి వస్తుంది. కాళ్ళల్లో స్పర్శ తగ్గిపోతోంది. వెన్నుపూస ఆకారం మారిపోతోంది.

90శాతం అవే తగ్గిపోతాయి

వెన్నుముకలో డిస్కు సమస్యలు వచ్చిన మొదటిసారి నూటికి 90 శాతం అవే తగ్గిపోతాయి. తొలిసారి సమస్య వచ్చినప్పుడు విశ్రాంతి తీసుకోవాలి. 48 గంటలపాటు నడుంకు విశ్రాంతి ఇస్తే నొప్పి తగ్గుతోంది. వేడినీళ్ల కాపడం, ఫిజియోథెరఫీ, నొప్పి నివారణ మాత్రలు కొద్దిపాటి వ్యాయామం ద్వారా మూడు వారాల్లో నొప్పి తగ్గిపోతుంది. రెండో సారి సమస్య వస్తే 50శాతం ఎలాంటి వైద్యం చేయకుండానే తగ్గిపోతాయి. మొండిగా సమస్య ఉన్నవారికి తుంటికి ఇంజక్షన్ ఇవ్వడం ద్వారా మూడు వారాల్లో నొప్పి తగ్గిపోతుంది. మూడోసారి మరలా డిస్కు సమస్య వస్తే 20 శాతం మాత్రమే వాటంతట అవి తగ్గుతాయి. మిగతా వాటికి తప్పనిసరిగా వైద్యం చేయాల్సి ఉంటుంది. కీ హోల్ సర్జరీ ద్వారా ఎముక, కండ కట్ చేయకుండా చిన్న రంధ్రం ద్వారా జరిగిన ఎముకను సరిచేసి నొప్పిని నివారించవచ్చు.

ఇవన్నీ అపోహలే ..

వెన్నుముక సర్జరీలు సురక్షితం కాదనే అపోహ ప్రజల్లో ఉంది. సర్జరీ చేసే సమయంలో నరాలు దెబ్బతింటే జీవితాంతం నడక ఉండదని భావిస్తారు. ఒకసారి సర్జరీ చేస్తే మరలా మరలా చేయాల్సి వస్తుందనే అపోహ ప్రజల్లో ఉంది. సర్జరీ చేయించుకున్నవారు వంగకూడదు, బరువు ఎత్తకూడదు, జీవితాంతం జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలు భావిస్తారు. ఇవన్నీ కేవలం అపోహలు మాత్రమే.

స్టాండింగ్ ఎమ్మారైతో త్వరితగతిన నిర్ధారణ



నడుము, మెడ, వెన్నుముక సమస్యలను నిర్ధారించేందుకు సాధారణ ఎమ్మారై ద్వారా రోగిని పడుకోబెట్టి స్కాన్ చేస్తారు. తద్వారా కొన్ని సార్లు వ్యాధి నిర్ధారణ పూర్తిగా జరగదు. నేడు స్టాండింగ్ ఎమ్మారై ద్వారా రోగిని నిలబెట్టి, కూర్చొబెట్టి మెడ వంచి ఎమ్మారై స్కానింగ్ పరీక్ష చేయడం ద్వారా పూర్తి స్థాయిలో నూటికి నూరు శాతం వ్యాధి నిర్ధారణ చేయవచ్చు. కంప్యూటర్ న్యావిగేషన్, న్యూరో మానిటరింగ్, మైక్రోస్కోప్ ఆపరేషన్లతో వెన్నుముక సమస్యలను చాలా సులువుగా నయం చేస్తున్నారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా డిస్కు ఆపరేషన్లు ఉచితంగా చేస్తున్నారు.

–డాక్టర్ జి. నరేష్‌బాబు,
మల్లిక స్పయిన్ హాస్పిటల్ సర్జన్, గుంటూరు

క్లుప్తంగా

ఏఎస్ఐ కుటుంబానికి చెక్కు పంపిణీ



నగరంపాలెం: తూర్పు సబ్ డివిజన్‌లోని లాలాపేట పీఎస్‌లో విధులు నిర్వర్తించే ఏఎస్ఐ బాలకృష్ణ గతేడాది డిసెంబరు 23న హఠాత్తుగా మృతి చెందారు. కార్పస్ ఫండ్ కింద మంజూరైన లక్ష రూపాయల చెక్కుని శుక్రవారం బాలకృష్ణ భార్య భూలక్ష్మికి జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో ఎస్పీ తుషార్ డూడీ అందజేశారు. బాలకృష్ణ కుటుంబ సభ్యులకు పోలీస్ శాఖ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మినిస్టీరియల్ సిబ్బంది రమాదేవి పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం



పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ 25వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. మూలవిరాట్‌కు విశేష అభిషేకాలు, అర్చనలు, విష్వక్సేన ఆరాధన, సామూహిక, విష్ణు, లలితా సహస్రనామ, హనుమాన్ చాలీసా పారాయణలు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన గజ వాహనంపై ఉత్సవమూర్తులకు నగరోత్సవం నిర్వహించారు. రాత్రి శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీ వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులకు వేద పండితుల ఆధ్వర్యంలో మంత్రార్థాలను వివరిస్తూ కల్యాణాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య అధ్యక్షత వహించారు. చిన్మయ మిషన్ బ్రహ్మచారి సువీరానందస్వామి అనుగ్రహభాషణం చేశారు. సభలో ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య, ప్రముఖ వ్యాపారవేత్త మర్రెడ్డి రామకృష్ణారెడ్డి, సాహితీవేత్తలు గుదిమెళ్ల శ్రీకూర్మనాథస్వామి, డాక్టర్ డి.యస్. దీక్షిత్, నోరి నారాయణమూర్తి, భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ అధ్యక్షుడు బొల్లేపల్లి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు సూర్యదేవర వెంకటేశ్వరరావు, లంకా విజయబాబు, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, కోశాధికారి లంకా సూర్యనారాయణ, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, పుట్టగుంట ప్రభాకరరావు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు



పట్నంబజారు : గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. కొత్తపేట పోలీసు స్టేషన్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ షేక్ అన్వర్ బాషా శుక్రవారం వివరాలు వెల్లడించారు. తేలిగ్గా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో వ్యసనాలకు బానిసలైన ఇద్దరు యువకులు గంజాయి విక్రయిస్తున్నట్లు పోలీసులు పక్కా సమాచారం అందుకున్నారు. ఈ క్రమంలో నెహ్రూనగర్, 7వ లైను చివర న్యూ గుంటూరు రైల్వే స్టేషన్ సమీపంలో గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం మేరకు కొత్తపేట ఎస్‌హెచ్‌ఓ అన్వర్‌బాషా, ఎస్ఐ ఎం.హనుమంతరావు ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేయగా ఇద్దరు యువకులు పారిపోయే ప్రయత్నం చేశారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా ప్రస్తుతం నల్లపాడులోని స్నేహ ఎన్‌క్లేవ్‌లో నివాసం ఉండే బెంగుళూరుకు చెందిన నాగవర కృష్ణార్జున, సంపత్‌నగర్‌కు చెందిన విచారపు బానుప్రకాష్‌గా గుర్తించినట్లు చెప్పారు. వారి నుంచి నాలుగు కేజీల 600 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఒడిస్సా ప్రాంతం నుంచి గంజాయి తెప్పించి పొట్లాలు చేసి నగర శివారు ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఈ మేరకు ఇద్దరు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన ఏఎస్ఐ ఎం.ఆంథోని, హెడ్ కానిస్టేబుల్ నక్కా రవి, కానిస్టేబుల్ ఎన్.ఎస్.ఆర్.కోటేశ్వరరావు, దేవభిక్షం, షేక్ నజీర్‌లను ఈస్ట్ సబ్ డివిజన్ ఏఎస్పీ నిశికేష్ షలేకే అభినందించారు.

త్వరలో మరిన్ని బ్యాంక్ బ్రాంచ్‌లు

నగరంపాలెం: త్వరలో గోరంట్ల, నరసరావుపేట, తెనాలిలో ఏలూరి బ్యాంక్ నూతన శాఖలను ప్రారంభించనున్నట్లు ప్రధాన శాఖ అధికారి ఎన్.సీతారామాంజనేయులు తెలిపారు. బ్రాడీపేట శాఖలో శుక్రవారం ఖాతాదారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శాఖ వ్యాపారం రూ.68 కోట్లకు చేరిందని అన్నారు. విప్లవాత్మకమైన డిజిటల్ సేవలు, యూపీఐ, ఫోన్‌పే, డెబిట్ కార్డుల అవశ్యకతను వివరించారు. బ్యాంక్ అందిస్తున్న సేవలపై ఖాతాదారులు సంతృప్తి వ్యక్తం చేశారు.

12 మంది వలంటీర్లు తొలగింపు

నెహ్రూనగర్: సార్వత్రిక ఎన్నికల ఎన్నిక కోడ్ అమలులోకి వచ్చిన అనంతరం రాజకీయ నాయకుల సమావేశాలకు హాజరైన 12 మంది వలంటీర్లను, ప్రజాప్రతినిధులతో ప్రచారాల్లో ఉన్న ఇద్దరు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగిస్తూ నగర కమిషనర్, గుంటూరు తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కీర్తి చేకూరి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల సంఘం నిబంధనలను ప్రతి ఒక్కరూ విధిగా పాటించాల్సిందేనని, వాటిని మీరి ఉద్యోగులు రాజకీయ పార్టీల ప్రచారాలు, సభల్లో పాల్గొంటే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

రెండు రోజుల పాటు తాగునీటి సరఫరాలో అంతరాయం

నెహ్రూనగర్: సంగం జాగర్లమూడి నుంచి గుంటూరు నగరానికి తాగునీరు సరఫరా చేసే 685 ఎం.ఎం. డయా పంపింగ్ మెయిన్ లైన్‌పై లీకు ఏర్పడి నీరు వృథా అవుతోందని, మరమ్మతుల నిమిత్తం సంగం జాగర్లమూడి ఫిల్టరేషన్ ప్లాంట్ పూర్తిగా నిలుపుదల చేయనున్నట్లు నగర కమిషనర్ కీర్తి చేకూరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25న సోమవారం ఉదయం సరఫరా అనంతరం పనులు చేపట్టడానికి ఇంజినీరింగ్ అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారని ఆమె పేర్కొన్నారు. పైప్‌లైన్ మరమ్మతు పనుల వల్ల సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం ఉదయం వరకు 5,7 డివిజన్లలోని నాజ్ సెంటర్, గుంటూరువారి తోట, పాత్తూరువారి తోట, గణేష్‌రావు పేట, కొత్తపేట, రాజాగారితోట, రామిరెడ్డితోట 1 నుంచి 8 లైన్లు, గంటలమ్మ చెట్టు, చౌత్రా సెంటర్, పూల మార్కెట్, ఎల్బీనగర్, బాలాజీ నగర్ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. మంగళవారం (26వ తేదీ) సాయంత్రం నుంచి సరఫరా యథావిధిగా జరుగుతుందని వివరించారు.

జగనన్న పాలనలోనే భావితరాలకు మంచి

తూర్పు నియోజకవర్గ అభ్యర్థి షేక్ నూరిఫాతిమా


పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి స్వాగతం పలుకుతున్న నూరిఫాతిమా

పట్నంబజారు: భావితరాలకు మంచి జరగాలంటే వై.ఎస్.జగనన్నను తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి షేక్ నూరిఫాతిమా చెప్పారు. నియోజకవర్గంలోని 15వ డివిజన్‌లో శుక్రవారం సుమారు 30 సంవత్సరాల నుంచి టీడీపీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న 32 కుటుంబాల చంద్రబాబుకాలనీ వాసులు షకీలా, మస్తాన్‌లు, వారి కుటుంబ సభ్యులతో కలిసి వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి షేక్ నూరిఫాతిమా కండువాలు కప్పి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై ఆయా పార్టీలకు చెందిన ప్రతి ఒక్కరూ వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని తెలిపారు. సంక్షేమ పాలన కోసం మరోమారు వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ అడుగులు వేస్తున్నారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం తథ్యమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు మస్తాన్, నన్నే పాల్గొన్నారు.

చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు శాఖ ప్రారంభం


బ్యాంకును ప్రారంభిస్తున్న నాగేశ్వరరావు

గుంటూరు ఈస్ట్: చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు 257వ శాఖను బ్రాడీపేటలో శుక్రవారం ప్రారంభించారు. బ్యాంకు సెంట్రల్ ఆడిటర్ జి.నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని శాఖను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు గుంటూరు జిల్లాలో బ్యాంకింగ్ సేవల్లో ప్రముఖ పాత్ర వహిస్తోందని తెలిపారు. నగరంలో సేవల్ని మరింత విస్తృతం చేసేందుకు ఈ శాఖను ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. బ్యాంకు చైర్మన్ టి.కామేశ్వరరావు మాట్లాడుతూ మార్కెట్ పరిస్థితులకతీతంగా సమాజంలోని అన్ని వర్గాల ఖాతాదారులకు ఆర్థికంగా ప్రయోజనం చేకూర్చేందుకు డిపాజిట్లపై అత్యధికంగా 8.60 శాతం వడ్డీ అందిస్తున్నట్లు చెప్పారు. విదేశాల్లో ఉన్నత చదువుల కోసం బ్యాంకు గడిచిన రెండు సంవత్సరాల్లో 550 మంది గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు రూ. 70 కోట్ల మేరకు విద్యా రుణం అందించిందని వెల్లడించారు. ఖాతాదారుల అవసరాలకు తగ్గట్లుగా రుణ సదుపాయాలు అందుబాటులోకి తీసుకొస్తుండటంతో 20 జిల్లాల్లో 27 లక్షల మంది ఖాతాదారులు అభిమానం చూరగొందని తెలిపారు. బ్యాంకు రూ. 22వేల కోట్ల వ్యాపారం సాధించిందని చెప్పారు. కార్యక్రమంలో సెంట్రల్ ఆడిటర్ పి.కిరణ్, బ్యాంకు జనరల్ మేనేజర్ డాక్టర్ బి.వి.రమణారావు, బ్యాంకు గుంటూరు రీజినల్ మేనేజర్ పి.వీరారెడ్డి, అధికారులు బి.శ్రీనివాసరావు, సువర్ణరాజు, యామలయ్య, బ్యాంకు ప్లానింగ్ మేనేజర్ కె.ఆంజనేయులు, బ్రాంచ్ మేనేజర్ వీరబ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

కేంద్ర బలగాలతో పోలీసుల కవాతు


పోలీసు కవాతులో పాల్గొన్న ఈస్ట్ డివిజన్ ఏఎస్పీ నచికేత్ షెల్కే, అదనపు ఎస్పీ శ్రీనివాసరావు


కవాతులో పాల్గొన్న సీఐఎస్‌ఎఫ్ బలగాలు

నగరంపాలెం: తూర్పు సబ్ డివిజన్‌లోని ప్రధాన రహదారులు, అడ్డరోడ్డుల్లో శుక్రవారం పోలీసులు కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఐపీఎస్ అధికారి మొదలుకుని పలువురు పోలీస్ ఉన్నతాధికారులు, బలగాలు ఒకరి తర్వాత ఒకరూ నడిచి వెళ్తూ, ఓటర్లకు భరోసా కల్పించారు. స్వేచ్ఛయుతమైన వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు సహకరించాలనే సందేశాన్ని అందించారు. ఒక్కసారిగా రహదారులపైకి వచ్చిన పోలీస్, కేంద్ర బలగాలను వీక్షించేందుకు నగరవాసులు ఆసక్తి చూపించారు.

జెండా ఊపి ప్రారంభించిన ఏఎస్పీ నచికేత్

జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు శుక్రవారం సాయంత్రం మార్కెట్ కూడలిలోని హిమనీ సెంటర్ వద్ద ప్రారంభమైన పోలీస్ కవాతును తూర్పు ఏఎస్పీ నచికేత్ షెల్కే జెండా ఊపి ప్రారంభించారు. పూల మార్కెట్, లాంచెస్టర్ రోడ్డు, బారాఇమామ్‌పంజా, పొన్నూరు రోడ్డు, బోస్ బొమ్మ కూడలి, నాజ్ కూడలి ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల వైపుగా కొనసాగింది. సీఐఎస్‌ఎఫ్ సిబ్బంది చేతుల్లో తుపాకులు, బూట్ల చప్పుళ్లతో నడిచి వెళ్లడంతో స్థానికులు, దుకాణదారులు ఆసక్తిగా చూశారు. ఓటర్లకు ధైర్యం కలిగించేందుకు, వారిని మరింత చైతన్యవంతులు చేసేందుకు కేంద్ర సాయుధ బలగాలు, స్థానిక పోలీసులతో కవాతు నిర్వహించినట్లు ఏఎస్పీ నచికేత్ షెల్కే తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతమైన వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలందరూ సహకరించాలని ఆయన కోరారు. అసాంఘిక శక్తులకు సహకరించవద్దని చెప్పారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారి సమాచారాన్ని అందించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో జిల్లా ఏఎస్పీ శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ శాంతకుమార్, సీఐలు అన్వర్‌బాషా , రమేష్‌బాబు, పలువురు ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్ యార్డులో ఎన్నికల కోడ్ అమలు

నగరంపాలెం: ఎన్నికల కోడ్ దృష్ట్యా గుంటూరు మార్కెట్ యార్డు ఆవరణలో రాజకీయ నేతల ఫొటోలు, ఫ్లెక్సీల ఏర్పాటుతో పాటు రాజకీయ సమావేశాలు నిర్వహించరాదని వ్యవసాయ మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి (ఎఫ్ఏఎస్) కాకుమాను శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరైనా అతిక్రమిస్తే శిక్షార్హులని ఆయన పేర్కొన్నారు. యార్డులో ఈనెల 16 నుంచి జూన్ ఆరో తేదీ వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందని ఆయన తెలియజేశారు.

బీజేపీకి బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధం

ఆప్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ టి.సేవకుమార్

గుంటూరు మెడికల్: బీజేపీ కుటిల నీతికి ప్రజలు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని, ప్రధాని నరేంద్ర మోదీ నియంతలా పాలిస్తూ రాజ్యాంగాన్ని కాలరాస్తూ ప్రజాస్వామ్యానికే తూట్లు పొడుస్తున్నారని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ తాతా సేవకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అక్రమ అరెస్టును ఖండించారు. ఆమ్ ఆద్మీ పార్టీని, అరవింద్ కేజ్రీవాల్‌ను చూసి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భయపడుతున్నారని తెలిపారు. గత రెండు సంవత్సరాల నుంచి ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులను ఎన్నికల సమయంలోనే అరెస్టు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇటీవల ఎలక్టోరల్ బాండ్ల ద్వారా అక్రమాలకు పాల్పడిన బీజేపీ ప్రభుత్వం తప్పులు కప్పిపుచ్చుకోవడానికే ఈ అరెస్టు జరిగిందని విమర్శించారు. ఛండీగఢ్ మేయర్ ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడిన బీజేపీ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు మొట్టికాయి వేసిందని, అయినా బీజేపీ ప్రభుత్వానికి బుద్ధి రాలేదన్నారు. పలు రాష్ట్రాల్లో ప్రజా ప్రభుత్వాలను కూలదోసి అక్రమంగా బీజేపీ పాలిస్తోందని, దానికి కాలం చెల్లిందని ధ్వజమెత్తారు. రానున్న సార్వత్రిక ఎన్నికలలో దేశవ్యాప్తంగా బీజేపీ కుటిల బుద్ధికి ప్రజలు చెంపపెట్టు తీర్పును ఇవ్వనున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. అక్రమంగా అరెస్టు చేసిన అరవింద్ కేజ్రీవాల్‌ను విడుదల చేయాలని, లేనిపక్షంలో దేశవ్యాప్త ఉద్యమం చేపడతామని తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం



గుంటూరు మెడికల్: కొరిటెపాడు గాంధీబొమ్మ ఎదురు చలివేంద్రాన్ని పవన్ జోవిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఫౌండేషన్ ఫౌండర్ సీదా పవన్ మాట్లాడుతూ నగరంలో మరికొన్ని ప్రాంతాల్లో తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ముల్పూరి వంశీ, కందుల దిలీప్, తల్లం శివకుమార్, అందె వెంకటేష్, గోపి ముద్రబోయిన, అరియం రామారావు పాల్గొన్నారు.

నీటి వనరుల సంరక్షణతోనే జీవకోటి మనుగడ


చిత్రలేఖన పోటీల విజేతలతో బ్రహ్మం, మనోహర్, సుధీర్‌కుమార్ తదితరులు


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

గుంటూరు ఎడ్యుకేషన్: నీటి వనరుల సంరక్షణపైనే జీవకోటి మనుగడ ఆధారపడి ఉందని టీజేపీఎస్ కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం పేర్కొన్నారు. పట్టాభిపురంలోని కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ జల వనరుల సంరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏఎన్‌యూ అంతర్ కళాశాలల పరిధిలో ''సేవ్ వాటర్ –సేవ్ లైఫ్'' అనే అంశంపై చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మం మాట్లాడుతూ సకల జీవకోటికి ఆహారం, నీరు ముఖ్యమని తెలిపారు. పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకుని నీటిని పొదుపుగా వాడాలని ఆయన సూచించారు. ఇంకుడు గుంతల తవ్వకంతో భూగర్భ జలాలను పెంపొందించుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మకుటం శివ, ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్, గుంటూరు జిల్లా ఎన్ఎస్ఎస్ నిర్వహణ అధికారి డాక్టర్ జేవీ సుధీర్ కుమార్, న్యాయ నిర్ణేతలు రాంబాబు, ఎస్ఆర్ శ్రావ్యశ్రీ, అధ్యాపకులు పావని, అమూల్య, సురేష్ కుమార్, శ్రావణి, విద్యార్థులు పాల్గొన్నారు.

జల వనరులను సంరక్షించి భావితరాలకు అందించాలి

జల వనరులను సంరక్షించి భావితరాలకు అందించాల్సిన బాధ్యత సమాజంలోని ప్రతి ఒక్కరిపై ఉందని గుంటూరు చలమయ్య–కర్పూరపు వెంకట నారాయణ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. శ్రీనివాసరావు పేర్కొన్నారు. సంగడిగుంటలోని కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ జల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ నీటిని అమూల్యమైన సంపదగా భావించి, పొదుపుగా వాడుకోవాలని సూచించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి ఏ. శ్రీధర్ మాట్లాడుతూ నీటి వృథాను అరికట్టి, ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేయాల్సిన అవసరముందని తెలిపారు. మరో ఎన్ఎస్ఎస్ అధికారిణి శ్రీలక్ష్మి మాట్లాడుతూ మన దేశంలో నీటి సంరక్షణ పద్ధతుల్ని అవలంబించకపోతే రాబోయే కొన్నేళ్లలో హైదరాబాద్ సహా 23 నగరాల్లో భూగర్భ జలాలు అడుగంటిపోతాయని నీతి ఆయోగ్ నివేదిక స్పష్టం చేస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ అధికారి జె.చంద్రశేఖర్, కల్చరల్ కో–ఆర్డినేటర్ మధుసూదన్, అధ్యాపకులు చైతన్య, వెంకటేష్, అనూరాధ, విద్యార్థులు పాల్గొన్నారు.

సురక్షిత నీటితో వ్యాధుల నుంచి రక్షణ

పరిశుభ్రమైన నీటిని తాగడం ద్వారా వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని నగరపాలక సంస్థ డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాము తెలిపారు. ప్రపంచ జల వనరుల సంరక్షణ దినోత్సవం సందర్భంగా సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగ ఆధ్వర్యంలో నాజ్ సెంటర్లోని లోలెవల్ రిజర్వాయర్ కేంద్రంలో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ తక్కెళ్లపాడు ప్రధాన రిజర్వాయర్ నుంచి వస్తున్న నీటిని రెండు పీపీలు ఉండేలా క్లోరినేషన్ చేసి నాజ్ సెంటర్‌లోని రిజర్వాయర్ ద్వారా పరిసర ప్రాంతాలన్నింటికీ సరఫరా చేస్తున్నట్లు వివరించారు. ప్రతి గంటకి నీటిలో క్లోరిన్ శాతాన్ని క్రమబద్ధీకరించే విధంగా పరీక్షలు నిర్వహిస్తుంటామని తెలిపారు. కార్యక్రమంలో పర్యావరణ విద్య సమన్వయ కర్త డి. తిరుపతిరెడ్డి, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ధాత్రీకుమారి, విద్యార్థినులు పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభం


పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

పాత గుంటూరు: ఆర్. అగ్రహారంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో 28వ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, దీక్షాధారణ, అంకురారోపణ, వాస్తు హోమం ధ్వజ పటాదీవాసం తదితర కార్యక్రమాలను వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ, దేవస్థాన కార్యదర్శులు పాతకోట బ్రాహ్మణయ్య నాయుడు, దాసరి భాస్కరరావు పర్యవేక్షించారు.

ఎపిసోర్స్ సంస్థలో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు



గుంటూరు ఎడ్యుకేషన్: జేకేసీ కళాశాలలో శుక్రవారం చెన్నైకు చెందిన ఎపిసోర్స్ సంస్థ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో కళాశాలకు చెందిన ఐదుగురు డిగ్రీ చివరి సంవత్సర విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ. నాగేశ్వరరావు తెలిపారు. ఒక్కో విద్యార్థి రూ.3.5 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలకు ఎంపికైనందుకు వారిని అభినందించారు. ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఎంపిక పరీక్షలో ప్రతిభ చూపిన 45 మందికి వివిధ దశల్లో ఎంపిక పరీక్షలు నిర్వహించిన తరువాత విద్యార్థులు నాగుల్ మీరా, రాఘవి, కల్పన, శ్రీదేవి, నసీఫా ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, కరస్పాండెంట్ జాగర్లమూడి మురళీమోహన్, పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్సార్కే ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ పి. గోపీచంద్, ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ వై.సురేష్‌బాబు విద్యార్థులను అభినందించారు.